
# ఎండలు.. జరపైలం

**తగినంత నీరు.. పౌష్టికాహారం తప్పనిసరి**

**జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు**

**40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు**









ఇబ్రహీంపట్నం/వికారాబాద్, ఏప్రిల్ 13 : ఎండలు మండిపోతుండటంతో ప్రజలు భానుడి తాపానికి ఇబ్బందులకు గురవుతున్నారు.ఉదయం 9గంటలు అయ్యిందంటే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటే భయపడుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొంది తమను తాము కాపాడుకోవడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే అనారోగ్యాల బారిన పడే అవకాశముంటుందని తెలియజేస్తున్నారు. ఎండలో ఎక్కువ తిరగకూడదు. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే గొడుగులు, తలపై క్యాప్‌లు, స్కార్ఫ్‌లు ధరించాలంటున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఎండలు తీవ్రరూరం దాల్చే అవకాశమున్నందున సరైన జాగ్రత్తలు పాటించాలంటున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నీటిని ఎక్కువగా తాగడంతో పాటు పండ్లను తరచుగా తింటూ ఉండాలని చెబుతున్నారు. కొబ్బరిబోండాం, నిమ్మరసం, చెరుకురసం, పండ్లు తీసుకోవడంతోపాటు ఓఆర్‌ఎస్‌ను నీళ్లలో కలుపుకుని తాగితే మంచిదంటున్నారు. ఎండలో పని చేసేవారు వడదెబ్బ బారినపడి అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, నీటిని ఎక్కువగా తాగుతున్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారు గొడుగులు, చిన్నపాటి టెంట్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. పండ్లు, తాటి ముంజలను కొనుగోలు చేస్తున్నారు. పాదచారులు తలపాగాలు ధరించి ఎండనుంచి విముక్తి పొందుతున్నారు. ఉక్కబోత నుంచి తప్పించుకునేందుకు కరెంట్ బిల్లులను సైతం లెక్క చేయకుండా చాలామంది కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సి వస్తున్నది. కరెంట్ లేని ఇండ్లల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

### కళ్లు జరభద్రం

ఎండలో ఎక్కువగా తిరిగితే కళ్లకు అలసట వస్తుంది. కళ్లచుట్టూ నల్లచారలు ఏర్పడతాయి. అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడే కళ్లజోడు తప్పక ధరించాలి. తరచుగా చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. వేడి గాలికి కళ్లజోడు కళ్లకు రక్షణగా పనిచేస్తుంది. బైక్‌పై ఎండలో వెళ్లేటప్పుడు కళ్లజోడు లేదా, హెల్మెట్‌ను ధరించడం తప్పనిసరి.

### కేశాల రక్షణ కోసం..

సూర్యకిరణాలు జుట్టుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వాటివల్ల జుట్టు పేలవంగా తయారయ్యే ప్రమాదముంది. బయటకు వెళ్లేటప్పుడు స్కార్ఫ్ కట్టుకోవాలి. చల్లటి నీటితో స్నానం చేయాలి. వేసవిలో జుట్టుకు రోజుకు రెండుసార్లు నూనె రాయాలి.

### చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి

ఎండాకాలంలో సాధారణంగా చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తాయి. ఏమాత్రం అశ్రద్ధ చేసినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో ఎండలో బయటకి వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని తీసుకెళ్లాలి. ముఖ్యంగా ప్రయాణాలను సాధ్యమైనంత వరకు సాయంత్రానికి వాయిదా వేసుకోవాలి. ఆభరణాలు ధరించే వారికి మెడచుట్టూ చెమట కారణంగా అలర్జీ వచ్చే అవకాశమున్నందున ఆభరణాలు ధరించకపోవడం మంచిది. శరీర పరిశుభ్రత ముఖ్యం. చంకలు, తొడల మధ్య భాగంలో ఫంగస్ చేరే అవకాశమున్నందున రెండు పూటలా స్నానం చేయాలి. ఉతికిన బట్టలనే ధరించాలి. కాచి, వడబోసిన నీటిని తాగాలి. వేసవిలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

### వేసవిలో ఆహారంపట్ల సరైన జాగ్రత్తలు పాటించాలి

మంచి పోషక విలువలున్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలి. మద్యం, కాఫీ, టీ, ధూమపానానికి దూరంగా ఉంటే మంచిది. మసాలాలను తగ్గించాలి. తద్వారా గ్యాస్ట్రబుల్ నియంత్రణలో ఉంటుంది. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలి. చికెన్, మటన్ వంటి వాటిని వేసవిలో తినకపోవడమే మంచిది.


### వడదెబ్బ లక్షణాలు

* ఒకేసారి తీవ్రమైన జ్వరం రావచ్చు.
* తలనొప్పి, తలతిప్పుట, వికారం, వాంతులు అవుతాయి.
* విపరీతమైన చెమటలు పట్టడం, చర్మం పొడిగా మారడం.
* తికమకపడుట, మూర్ఛపోవుట, కడుపులో తిప్పడం, నొప్పి రావడం.
* కొన్ని సమయాల్లో 1, 2 సార్లు నీళ్ల విరేచనాలు కావడం.
* నాడి బలహీనంగా కొట్టుకొనుట, రక్తపోటు(బీపీ)తగ్గుట.
* దాహంచే నాలుక పిడుచకట్టుకపోవడం, శరీరానికి కావలసిన నీరు లభించక హృదయం, మూత్ర పిండాలు తదితర సున్నితమైన అవయవాలు తమ తమ పనులు నిర్వర్తించకపోవటం వలన మనిషి చనిపోవడం జరుగుతుంది.

### తీసుకోవలసిన జాగ్రత్తలు

* ఎక్కువ సమయం ఎండలో గడపరాదు.
* వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, ఇతరులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల తరువాత పనిచేయాలి.
* ఒక వేళ ఎండలో పని చేయాల్సి వస్తే ప్రతి గంటకు చల్లని నీరు తాగాలి.
* తల భాగం తగిన రక్షణకై గుడ్డ లేదా టోపీ పెట్టుకొని కాపాడుకోవాలి.
* ఓఆర్‌ఎస్ ద్రావణం, నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తదితర పానీయాలు తరచుగా తాగాలి.
* వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, గాలి వెలుతురు బాగా తగిలేటట్లు చూడాలి. అనంతరం 108కి ఫోన్ చేసి సమీప దవాఖానకు తరలించాలి.

### జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా ఎండలో తిరగకూడదు. వివిధ పనుల నిమిత్తం బయటకువెళ్లే వారు నీరు, ఖనిజ లవణాలు విసర్జింపబడుట వలన డీ హైడ్రేషన్‌కు గురై వడదెబ్బ తగులుతుంది.తల పాగా, టోపీ వంటివి తప్పనిసరిగా ధరించాలి. పనులు ముగిసిన వెంటనే ఇంటికి చేరుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. నీరు, పళ్లరసాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లేవారు నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

**- డాక్టర్ రామచంద్రయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ దవాఖాన, వికారాబాద్**

### చిన్నపిల్లల రక్షణ కోసం..

* పిల్లలు ఎండ తీవ్రతను తట్టుకోలేరు. వేసవిలో తల్లిదండ్రులే వారికి గొడుగులా రక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.
* మధ్యాహ్నం సమయంలో ఆడుకోవడానికి అనుమతించకూడదు.
* మైదానాల్లో క్రీడలు ఆడేందుకు సాయంత్రం వేళల్లో పంపాలి.
* అన్ని రక్షణలున్న స్విమ్మింగ్‌పూల్‌కే పంపించాలి.
* బయటి తిండికి అలవాటు పడకుండా చూసుకోవాలి.
* నీరు, పండ్ల రసాలు, మజ్జిగ, అంబలి తాగిస్తుండాలి.



వికారాబాద్ : మండుటెండలో కూరగాయలు అమ్ముతున్న రైతులు

## కేసీఆర్‌పై అభిమానంతో..

బీఆర్‌ఎస్ పార్టీ అవిర్భావ దినోత్సవం ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్ వజ్రోత్సవ మహాసభకు సంబంధించి గోడలపై చేతిరాతతో రాసి తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అధ్వర్యంలో వరంగల్ వజ్రోత్సవ సభకు లక్షలాదిగా తరలివెళ్లి విజయవంతం చేద్దామన్నారు.

- బొంరాస్‌పేట్, ఏప్రిల్ 13




## కొలతపేర కూలీలకు ఎఫ్‌ఏ వేధింపులు



కూలీ, ఎఫ్‌ఏ మధ్య వాగ్వాదం

బంట్వారం, ఏప్రిల్ 13 : కొలతల పేర ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్ వేధిస్తున్నారని సామాజిక మాధ్యమం ద్వారా గ్రామ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నది. కోట్‌పల్లి మండలం కంకణాళపల్లి గ్రామానికి చెందిన ఎఫ్‌ఏ నర్సింహులు సమయపాలన పాటించకుండా ఫీల్డ్‌కు రావడం లేదంటున్నారు. కూలీలు ఉదయం ఫీల్డ్‌కు వెళ్లి పనులు చేసి, ఎండ ఎక్కువైతుందని ఇంటికి వస్తుంటే, కొలతల్లో తేడాలు చూపుతూ, కూలీని తగ్గిస్తున్నారనే ఆరోపణ వ్యకమౌతున్నది. కొలతలను సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్ చేయాల్సింది, స్థానిక కూలీలు ఎలా చేస్తారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇదేకాక కొంత మంది కూలీలు పనులకు రాకున్నా వారి పేర్లు మస్టర్ వేస్తున్నారని పేర్కొంటున్నారు. నిత్యం పనిచేసే తమకు మాత్రం హాజరు వేయనని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏపీవో రాజ్‌ఈసాను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు. కొలతల విషయంలో టీఏ చూసుకుంటారని, ఎఫ్‌ఏలకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. కూలీలను వేధిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రవీంద్రభారతి : నర్తనం రెండో వార్షికోత్సవాలను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్తనం శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభివాణీదేవి, సినీనటి కృష్ణవేణి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.హరికృష్ణ, అనురాధ, శ్రీనివాస్‌రావు తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు ఎమ్మెల్సీ, సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ ప్రాచీన లలిత కళలు మన పూర్వీకులు ప్రసాదించిన వరప్రసాదమని.. ఆ కళల పరిరక్షణకు నాట్యగురువులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకురాలు, నాట్యగురువు వర్షిణిని అభినందించారు. సభకు ముందు నాట్యకారిణులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది.

## అలరించిన సంపూర్ణ శతావధానం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 13: అశేష సాహితీ ప్రియులు, కవి పండితులు, అవధానుల సమక్షంలో నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో సంపూర్ణ శతావధానం కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ప్రముఖ శతావధాని డాక్టర్ ఆముదాల మురళి సంచాలకత్వ బాధ్యతలో ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన అవధానంలో పృచ్ఛకులు సంధించిన సమస్యలను, నిషిద్ధాక్షరి, దత్తపది అంశాలకు తనదైన విద్వత్‌తో శతావధాన పూర్ణచంద్ర డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ పూరించి పద్యాలలోని మాధుర్యాన్ని అందించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, కార్యక్రమ అధ్యక్షుడు నారుమంచి అనంతకృష్ణశర్మ, కార్యదర్శి డాక్టర్ మారుమాముల దత్తాత్రేయశర్మ, సభా సంచాలకులు అవుసుల భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజా పద్యం, అవధాన వికాస పరిషత్ సంయుక్తాధ్వర్యంలో జరుగుతున్న సంపూర్ణ శతావధానం కార్యక్రమం సోమవారంతో ముగుస్తుందని నిర్వహణ కోశాధికారి కె.వి.ఎన్.ఆచార్య తెలిపారు.



పద్యాలను పూరిస్తున్న డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్

## శివారుల్లో అక్రమ మద్యం దుకాణాలు

- నిబంధనలు పట్టించుకోని దుకాణదారులు
- తమ బాస్ అధికార పార్టీవాడే అంటూ దబాయింపు
- మూముళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ అనుమతులు లేకుండా శివారుల్లో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. శనివారం హనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అన్ని చోట్ల మద్యం దుకాణాలు మూసేశారు. కాగా శివారుల్లో కొన్ని చోట్ల ప్రైవేట్ అడ్డాల్లో మద్యం ఏరులై పారింది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఒక భవనంలో మద్యం విక్రయాలు జరగడమే కాకుండా, అక్కడే సిట్టింగ్ చేస్తూ మందుబాబుల జాలీగా గడిపేశారు. శివారుల్లో బెల్ట్ షాప్‌లు చాలా వరకు కొనసాగుతున్నాయి. బెల్ట్‌షాపులంటే గ్రామీణ ప్రాంతాలు, బస్తీలలో దుకాణాలలో కొంత మేర మద్యం సీసాలు తెచ్చి విక్రయిస్తుంటారు. ఆయా పరిధుల్లోని మద్యం దుకాణాల నుంచి ఈ బెల్ట్‌షాపు నిర్వాహకులు మద్యం కొనుగోలు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీ భవనాలను తీసుకొని అందులో అనధికారికంగా మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్, పోలీసులకు తెలిసే జరుగుతున్నాయంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నెలవారీగా మామూళ్లు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ వ్యాపారాలు సాగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ 365 రోజులు 24 గంటలు మద్యం దొరుకుతుందంటూ స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. తమ ఉన్నతాధికారులకు తెలిస్తే తమకు సమస్యలొస్తాయంటూ స్థానిక అధికారులు దుకాణదారులతో మాట్లాడితే.. 'సార్ మా బాస్‌లు చూసుకుంటారు.. మా బాస్ అధికార పార్టీకి చెందినవాడే. ఆయనుండగా మీ వద్దకు ఎవరూ రారు.. మీరు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకండి.. మీకు ఏమి కావాలో చెప్పండి. అది పంపిస్తాం' అంటూ ఎక్కడికక్కడే అక్రమ వ్యాపారులు అధికారులను డబ్బుతో కట్టడి చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి పెడితే అక్రమ దందాలు బయటకు వస్తాయంటూ ప్రజలు చెబుతున్నారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి అంటూ బురిడీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 13 : ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ కోసం పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఫేస్‌బుక్‌లో వచ్చిన వీడియో చూసిన సినీ రచయిత సైబర్ మోసానికి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. యూసుఫ్‌గూడ సమీపంలోని ప్రగతినగర్‌లో నివాసముంటున్న జనార్దన్‌రెడ్డి సినీ రచయితగా పనిచేస్తుంటారు. రెండు రోజుల క్రితం ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ ద్వారా మంచి లాభాలు వస్తాయంటూ జీపీటీ ఆడిపెక్స్ అనే యాప్ గురించి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లు వచ్చిన వీడియో ఆకర్షించింది. అమెరికా డాలర్లు పెట్టుబడి పెడితే రెండు వారాల్లో లాభాలు వస్తాయని మరో లింక్‌లో చెప్పారు. దీంతో అతడు తన భార్య పేరుతో 430 డాలర్లు పెట్టుబడి పెట్టాడు. కొంతసేపు తర్వాత మరిన్ని డాలర్లు పెట్టుబడి పెట్టాలని రావడంతో అనుమానం వచ్చి వాకబు చేయగా నిర్మలా సీతారామన్ మాట్లాడిన వీడియో ఫేక్ అని తేలింది. ఇదంతా సైబర్ మోసగాళ్ల పని అని గుర్తించిన బాధితుడు జనార్దన్‌రెడ్డి సైబర్ హెల్ప్ లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రూ.39,694 మోసం జరిగిందంటూ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విస్తరణ మరిచి.. మెరుగులు దిద్ది..!

- మారని అంబేద్కర్ కూడలి, బిత్తరపోతున్న స్థానికులు
- నేడు అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



కొడంగల్ పట్టణంలో గతంలోని అంబేద్కర్ కూడలి

కొడంగల్, ఏప్రిల్ 13 : అంబేద్కర్ కూడలి విస్తరణ పనులు కొనసాగుతుంటే స్థానికులు, ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయని ఆశాభావంతో ఉన్నారు. కాగా పనులు జరుగుతున్న తీరును చూసి ప్రతిఒక్కరూ పెదవి విరుస్తున్నారు. కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి హైదారాబాద్-బీజాపూర్ 163, మహబూబ్‌నగర్-చించోలి 167 రెండు జాతీయ రహదారుల కూడలిగా ఉంటుంది. ఈ కూడలి గుండా ప్రతి రోజూ దాదాపు 20వేల వాహనాలు తిరుగుతుంటాయి. భారీ వాహనాలు కూడలిలో మలుపు తీసుకోవాలంటే ఇబ్బందితోపాటు ఇతరత్రా వాహనాలు నిలిచిపోవాల్సిందే.

ప్రభుత్వం కూడలి విస్తరణ పనులు చేపట్టేందుకుగాను రాష్ట్రస్థాయి అధికారులు పర్యటించి నూతన అధ్యాయం చోటు చేసుకునేలా కూడలి రూపురేఖలు మారుతాయని పరిశీలనలో పేర్కొన్నారు. కూడలి పనులకుగాను ప్రభుత్వం రూ.1.92కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుతం రూ.కోటి నిధులకు సంబంధించి పనులు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### బిత్తరపోతున్న స్థానికులు

అంబేద్కర్ కూడలి విస్తరణ చేపట్టేలా ప్రభుత్వం అన్నింటా మాస్టర్ ప్లాన్‌తో ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రణాళికను చూసి స్థానికులు కూడలికి మహర్దశ వచ్చిందని, కొడంగల్ పట్టణ ప్రధాన రహదారి కూడలి నూతనత్వాన్ని సంతరించుకుంటుందని సంతోషంచారు. గతంలో ఏర్పాటైన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి, కూడలి మధ్యలో ఉన్న హైమాస్ట్ లైట్లను తొలగించారు. లైట్లను కూడలికి దూరంలో ఏర్పాటు చేశారు. దీంతో కూడలి విస్తరణ జరుగుతుందని భావించిన స్థానికులు ప్రస్తుతం ప్రారంభానికి నోచుకొంటున్న కూడలిని చూసి బిత్తరపోతున్నారు. ఎప్పటి మాదిరిగానే కూడలి ఉందని, కేవలం మెరుగులు దిద్దుకొంటుందని పేర్కొంటున్నారు. కూడలి విస్తరణ చేపడితే కూడలిలోని ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయని భావించిన స్థానికులకు నిరాశే మిగిలింది.

### కూడలిలో జరిగిన పనులు

కూడలిలో గతంలో ఏర్పాటైన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి గతంకంటే ఎత్తుగా ఉన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కూడలిలో నూతనంగా బోర్‌ను డ్రిల్ చేయించారు. కూడలిలో గతంలోని ఇనుప సీకులను తెలగించి మార్బుల్ బండరాళ్లను చుట్టూ ఏర్పాటు చేశారు. అదేవిధంగా కార్పెట్ గడ్డి పనులు మాత్రమే జరిగాయి. కూడలిలోని పలు ప్రదేశాల్లో గతంలోని సిమెంట్ బ్రిక్‌లను తీసి బండరాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

### ఊహించింది ఒకటి.. జరుగుతున్నది మరోటి..

కూడలి విస్తరణ పనులు కొనసాగుతుంటే కూడలి విస్తరణ జరిగి ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయని ఊహించుకుంటే.. పైపై మెరుగులే కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. కూడలి పక్కనే ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కాగా, ప్రతి రోజూ తాండూరు నుంచి వచ్చే బస్సులు, ఇతరత్రా వాహనాలు కూడలిలో మలుపు చేసుకునే పరిస్థితి లేదు. ఇబ్బందికరంగా వాహనదారులు మలుపులు చేపట్టుకొంటున్నారు. బస్సులైతే తాండూరు వెళ్లే రోడ్డుకు మళ్లేందుకు ఆర్టీసీ డ్రైవర్‌లు నానా తంటాలు పడుతున్నారు. ఒక్కోసారి వెనక్కి తీసుకొని మళ్లీ ముందుకు మలుపు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది.

అంబేద్కర్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. విగ్రహ ప్రారంభోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని పచ్చదనం కనిపించేలా హడావుడిగా కార్పెట్ గడ్డిని ఏర్పాటు చేశారు.



ప్రస్తుతం మెరుగులు దిద్దుకున్న అంబేద్కర్ కూడలి

## మిల్క్ డెలివరీ బాయ్‌పై దాడి

బంజారాహిల్స్ : పాలప్యాకెట్లు వేస్తున్న యువకుడిపై దాడి చేయడంతోపాటు యాక్టివా బైక్ లాక్కుని వెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసముంటున్న రేపాక సాయికృష్ణ పంజాగుట్ట నాగార్జున సర్కిల్ సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ మిల్క్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందినగర్ ప్రాంతంలో పాల ప్యాకెట్లు వేసి రోడ్ నం.10లోని గణేశ్ జువెలర్స్ వైపునకు యాక్టివా బైక్‌పై వెళ్తున్నాడు. గ్లామర్ బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆగంతకులు కర్రతో సాయికృష్ణపై దాడి చేసి యాక్టివాను లాక్కుని పారిపోయారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.